క్లుప్తంగా

విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సీఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో విద్యార్థులు రక్తదానం చేశారు. ఇంజినీరింగ్ విద్యార్థుల్లో 50 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ సీఆర్‌ఆర్ విద్యా సంస్థల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించడానికి సహకరిస్తున్న యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. రక్తదానం చేసిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైద్యుడు ఆర్‌ఎస్‌ఆర్‌కే వరప్రసాదరావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాస రెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓ వి.ప్రణవ్, రూరల్ లయన్స్ క్లబ్ సభ్యులు, వీఆర్‌ఓ కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం పరిశీలన

దెందులూరు: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని మండలాధికారులు తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య, ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి, ఏఓ గద్దె రమేష్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సూచనలతో గ్రామాల్లో మొక్కజొన్న, వరి, ఇతర పంటలు నష్టపోయిన రైతులు, భూమి విస్తీర్ణం, పంట వివరాలను నమోదు చేసుకుంటున్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు మాట్లాడుతూ బాధిత రైతులు గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రంలో వివరాలు తెలియజేయవచ్చని సూచించారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

ఉంగుటూరు : మోటారుసైక్లిస్టు మంగళవారం ఏలూరు నుంచి ఉండి వెళుతుండగా చేబ్రోలు వద్దకు వచ్చేసరికి అతడిని కారు ఢీకొంది. దాంతో మోటారుసైక్లిస్టుకు గాయాలవడంతో అతడిని 108 వాహనంలో తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మోటారు సైకిల్ వెనుక కూర్చున్న వ్యక్తి అప్పటికే వాహనం దిగిపోవడంతో అతడు సురక్షితంగా బయటపడ్డాడు.

జూదరుల అరెస్టు

ఏలూరు టౌన్: ఏలూరు రూరల్ పరిధిలోని ద్వారకానగర్‌లో ఒక ఇంట్లో పేకాట శిబిరం నిర్వహిస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి, రూ.66,750 స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో ఏలూరు నగరపాలక సంస్థకు చెందిన ఉద్యోగి, మరో కాంట్రాక్ట్ ఉద్యోగి ఉన్నట్టు చెబుతున్నారు. ఏలూరు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అర్జావారిగూడెంలో..

భీమడోలు: భీమడోలు పంచాయతీ శివారు అర్జావారిగూడెంలో పేకాట ఆడుతున్న 8 మందిని మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.4120 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసామని ఎస్సై చావా సురేష్ కుమార్ తెలిపారు.

మద్ది ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు


మద్దిక్షేత్రంలో స్వామి ఉత్సవ మూర్తితో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రాన్ని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు వేదాంతం వెంకటాచార్యులు స్వామి వారికి తమలపాకులతో పూజలు చేశారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు తమ మొక్కులను సమర్పించుకున్నారు. ఆదాయం రూ.1,05,661 వచ్చిందని, 1200 మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారని ఆలయ ఈఓ కొండలరావు తెలిపారు.

గడపగడపకు సంక్షేమ ఫలాలు


ఏలూరు 1వ డివిజన్‌లో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని


పెదపాడు మండలంలోని కొక్కిరపాడులో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

1వ డివిజన్‌లో ప్రజలతో మమేకమైన ఎమ్మెల్యే నాని

ఏలూరు టౌన్: రాష్ట్రంలో ప్రతి ఇంటిలోనూ సంక్షేమ ఫలాలు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరు నగరంలో 84వ రోజు మంగళవారం పెద రైల్వేస్టేషన్ ఎదురుగా కోడేలు వంతెన సమీపంలో దివంగత వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును నాని అడిగి తెలుసుకున్నారు. అవ్వ, తాతలకు సక్రమంగా పింఛన్లు అందుతున్నాయా అని ఆరా తీశారు. ఏదైనా సాంకేతిక లోపంతో పథకాలు అందకపోతే వాటిని పరిష్కరించి అర్హులందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే నాని ఆదేశించారు. స్థానిక సమస్యలను పలువురు మహిళలు నాని దృష్టికి తీసుకురాగా వాటిని సత్వరమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. తొలుత 1వ డివిజన్ కార్పొరేటర్ ఆరేపల్లి రాధిక, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్తిబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నానికి సాదరస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గంలో ఇప్పటికే 30 వేలకుపైగా ఇళ్ల పట్టాల పంపిణీ చేశామన్నారు. చొదిమెళ్ల, కొమడవోలు తదితర వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయని, యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి పేదలకు గూడు కల్పించడమే తమ ధ్యేయమని వివరించారు. ఏలూరు నగరంలో ప్రతి పేదవాడికి సొంతిల్లు నిర్మించి ఇచ్చేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. టీడీపీ హయాంలో నగరంలో ఏ ఒక్క పేదవాడికి సెంటు భూమి కూడా ఇచ్చిన దాఖలు లేవని నాని ఆరోపించారు. కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, మాజీ చైర్మన్ మంచెం మైబాబు, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఎంఆర్‌డీ బలరాం, కార్పొరేటర్లు నున్నా స్వాతి శ్రీదేవి, జిజ్జువరపు విజయనిర్మల, సుంకర చంద్రశేఖర్, యర్రంశెట్టి సుమన్, గరికిముక్కు జయకర్, పార్టీ నాయకులు బండారు కిరణ్‌కుమార్, పాలడుగు మురళీశ్యామ్, కొల్లిపాక సురేష్, ప్రత్తిపాటి తంబి, యల్లపు మోజెస్, వైఎస్‌వీ శివరావ్, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, తహశీల్దార్ బీ.సోమశేఖర్, పీఓ కృష్ణమూర్తి, ఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధికి పథకాలు దోహదం

పెదపాడు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు పేదల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్నాయని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదపాడు మండలంలోని కొక్కిరపాడులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. కొక్కిరపాడులో కార్యకర్తలు నాయకులు అబ్బయ్యచౌదరికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రజలకు ప్రభుత్వం అందించిన పథకాలను వివరిస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రెయినేజీలు నిర్మించాలని, గృహనిర్మాణానికి సంబంధించిన బిల్లులు అందించాలని స్థానికులు కోరారు. అధికారులను సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పేద ప్రజల అభ్యున్నతికి పాటుపడుతున్నారని అన్నారు. పథకాలను పొందుతున్న వారంతా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరుతున్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో హౌసింగ్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు హాజరు కాకపోవడంతో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి వారిపై మండి పడ్డారు. హౌసింగ్ ఇళ్ల నిర్మాణంలో పురోగతి లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసారు. సర్పంచ్ మరీదు రెడ్డియ్య, ఎంపీటీసీ వీరంకి బుజ్జి, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు, నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు విజయబాబు, మండల కన్వీనర్ కామిరెడ్డి నాని, సచివాలయాల మండల కన్వీనర్లు అక్కినేని గోపీ చంద్ర దుర్గాప్రసాద్, కట్టా ఏసుబాబు, ఏలూరు డివిజన్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కత్తుల రవికుమార్, దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలా నవ కాంతం, నాయకులు సంబంగి శ్రావణ్‌కుమార్, వత్రపు కోటిరెడ్డి, కలపర్రు ఎంపీటీసీ కంభాల నాగరాజు, కిడిమి గోవిందరావు పాల్గొన్నారు.

రంచనగా పింఛన్


ఏలూరు : స్థానిక పోస్టల్ కాలనీలో మంగళ వారం డి.అజయ్‌కు దివ్యాంగుల పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కె.సుబ్బారావు

ఉపాధి పనుల తనిఖీ

దెందులూరు: జాతీయ ఉపాధి హామీ పథకం అమలులో మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు అంకితభావంతో విధులు నిర్వహించాలని అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ పురుషోత్తం అన్నారు. మంగళవారం దెందులూరు మండలం పోతునూరులోని ఫీడర్ చానెల్ పనిచేస్తున్న ఉపాధి కూలీలను, వారి హాజరును తనిఖీ చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై కూలీల నుంచి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. మండల ఏపీఓ దశరథ రాంజీ తదితరులున్నారు.

వైభవంగా నగరేశ్వర స్వామి కల్యాణోత్సవం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారం గంగా వింధ్య వాసిని సమేత నగరేశ్వర స్వామి దేవస్థానంలో కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి కల్యాణం మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన, హోమాలు, బలిహరణ పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. సాయంత్రం 6 గంటలకు ఆలయంలో స్వామి వారికి అమ్మవార్లకు ఎదుర్కోలు మహోత్సవం నిర్వహించారు. అనంతరం హోమాలు, బలిహరణ పూజలు చేశారు. రాత్రి 8 గంటలకు స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి రామపెద్దింట్ల రావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

బకాయి జీతాలు చెల్లించాలని వినతి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సమగ్రశిక్షా అభియాన్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఫిబ్రవరి, మార్చి నెలల జీతాలను వెంటనే చెల్లించాలని, జీతాల పెంపునకు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను కోరినట్టు ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఏలూరులో ఒకప్రకటన విడుదల చేశారు. డిగ్రీ కళాశాలల్లో ఉద్యోగుల కాంట్రాక్టును మరో రెండు నెలల పొడిగించాలని, పదో తరగతి పరీక్షా కేంద్రాలున్న హైస్కూళ్ల సిబ్బంది బాబూ జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ జయంతులు, గుడ్‌ఫ్రైడే, రంజాన్ సెలవులు వినియోగించుకునే అవకాశం కల్పించి, రెండు రోజులను ఓహెచ్‌గా పరిగణించాలని కోరామన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నాయకుడు వాసా శ్రీనివాసరావు ఉన్నారు.

పీహెచ్‌సీలో 24 గంటలు వైద్య సేవలు

పెదవేగి : పీహెచ్‌సీలో ఇకపై 24 గంటలు వైద్య సేవలు అందుతాయని వైద్యాధికారి పి పూర్ణిమ తెలిపారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఆదేశాలతో పేదలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు అదనంగా ఇద్దరు స్టాఫ్ నర్సులను జిల్లా వైద్యాధికారులు నియమించారని చెప్పారు. బి లావణ్య జిల్లా కేంద్ర ఆసుపత్రి నుంచి, బి ప్రశాంతకుమారిని పెదవేగి ప్రాథమిక వైద్యశాలకు బదిలీ చేయడంతో వైద్య సేవలు మరింత మెరుగుపడతాయని డాక్టర్ తెలియజేశారు.

విద్యుదాఘాతానికి పొగాకు కౌలు రైతు మృతి

కొయ్యలగూడెం: వేదాంతపురం గ్రామంలో విద్యుదాఘాతానికి గురై పొగాకు కౌలు రైతు మృతి చెందాడు. గ్రామానికి చెందిన దారం ఆంజనేయులు (35) సోమవారం రాత్రి తన ఇంట్లోని ఓ గదిలో పొగాకు కావు వేస్తుండగా పైన సీలింగ్ ఫ్యాన్‌కు చేయి తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై పడిపోయాడు. గదిలో కావు వేస్తున్న సమయంలో చెమట పట్టి తడిసిన దుస్తులతో ఉండటంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి అతనిని తరలించగా అప్పటికే ఆంజనేయులు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆంజనేయులు మూడెకరాలు కౌలుకు తీసుకుని పొగాకు సాగు చేస్తున్నాడు. ఆయన మృతితో భార్య, ఇద్దరు పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీజే విష్ణువర్ధన్ చెప్పారు.

శ్రీవారి క్షేత్రంలో ఆలయ శుభ్రత

250 మంది సేవకులతో కార్యక్రమం


కొండపైన ఘాట్ రోడ్ లో చెత్తా చెదారాన్ని తొలగించి శుభ్రం చేస్తున్న సేవకులు


కొండపైన ఆవరణలో చెత్త, పిచ్చి మొక్కలను తొలగిస్తున్న సేవకులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో శ్రీ భ్రమరాంబిక సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఆలయ శుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. దీనిలో భాగంగా దేవాలయ పరిసరాలు, కల్యాణకట్ట, గోసంరక్షణశాల క్యూలైన్లు, మండపాలు, దేవతామూర్తుల విగ్రహాలు, పూజ సామగ్రితో పాటు, పలు ప్రాంతాలను ఊడ్చి, కడిగి శుభ్రం చేశారు. అలాగే చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ కార్యక్రమంలో శ్రీ భ్రమరాంబిక సేవాసమితి, శ్రీ వద్దిపర్తి పద్మాకర్‌కు చెందిన గుడి–బడి శిష్య బృందం, తమిళనాడుకు చెందిన జగద్గురు సేవా బృందం వారు సుమారు 250 మంది పాల్గొన్నారు. వీరందరికీ దేవస్థానం అధికారులు స్వామి వారి ప్రత్యేక దర్శనంతో పాటు, ప్రసాదాలను అందజేశారు. అలాగే వసతి సౌకర్యాన్ని కల్పించారు. ఆలయ శుభ్రత కార్యక్రమం బుధవారం సైతం క్షేత్రంలో జరుగుతుందని శ్రీభ్రమరాంబిక సేవా సమితి అధ్యక్షురాలు ఎంవీఎస్ మహాలక్ష్మి తెలిపారు. గత ఏడేళ్లుగా తాము ఈ దేవస్థానంలో సేవ, హుండీ సేవను చేస్తున్నామని, ఆలయ శుభ్రతను కొత్తగా చేపట్టినట్టు చెప్పారు. ఇప్పటికే ఈ సేవను శ్రీశైలం క్షేత్రంలో నిర్వహించామని, ఇప్పుడు ఇక్కడ చేస్తున్నట్లు తెలిపారు.

పరిహారం పంపిణీలో విఫలం


సమావేశంలో మాట్లాడుతున్న మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పుష్పరాజ్

ఏలూరు (టూటౌన్): ఎస్సీ, ఎస్టీ కేసుల్లో పరిహారం అందజేయడంలో అధికారులు విఫలం అవుతున్నారని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ ఆరోపించారు. స్థానిక ఫైర్ స్టేషన్‌సెంటర్‌లోని ఓ ప్రైవేటు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరిగినప్పుడు.. బాధితులకు బాసటగా నిలబడి కేసులు నమోదు చేయించి ఉద్యమిస్తున్నామన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం అధికారులు అందజేయకుండా ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో పరిహారం ఇవ్వాల్సిన పేర్లను నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు కాపుదాసి రవికుమార్, నన్నేటి నాగరాజు, నల్లి వెంకటస్వామి, ప్రత్తిపాటి వినీత్, తోట రాజేంద్ర బాబు, బత్తుల అశోక్, బోడ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానంతో ఆత్మ సంతృప్తి


భక్తులకు స్వామి వారి ప్రసాదం పంపిణీ చేస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏ దానం చేసినా కలుగని ఆత్మ సంతృప్తి అన్నదానం చేయడం ద్వారా కలుగుతుందని జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ తెలిపారు. స్థానిక అమీనా పేట ఆంజనేయ స్వామి ఆలయంలో ఇటీవల నిర్వహించిన 88వ సీతారాముల కల్యాణ మహోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం ఆలయం వద్ద ఏర్పాటుచేసిన భారీ అన్న సమారాధనను ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అన్ని దానాల్లో కెల్లా అన్నదానానికి అధిక ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. పేద, ధనిక బేధం లేకుండా ఒకే వేదికపై దేవుని ప్రసాదాన్ని సహపంక్తి భోజనాలుగా స్వీకరించే కార్యక్రమాన్ని పురాణ పురుషులు ముందు చూపుతో ఆలోచించి ఏర్పాటు చేసిన గొప్ప సంస్కృతి అన్నారు. ఈ సంస్కృతిని కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏలూరు ఇన్‌చార్జి డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వర రావు, ఏఆర్ ఆర్ఐ పవన్ కుమార్, ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ దుర్గా ప్రసాద్, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లకు గెజిటెడ్ హోదా ఇవ్వాలి

దెందులూరు: రాష్ట్రంలోని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే (డివిజనల్ సర్వే అధికారి) అందరికీ గెజిటెడ్ హోదా కల్పించాలని ఏపీ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సొంగా రవీంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం గంగన్నగూడెంలో ఆయన మాట్లాడుతూ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లకు ఆఫీస్ రూం, కంప్యూటర్, ల్యాప్‌టాప్, అసిస్టెంట్లు, సౌకర్యాలను కల్పించాలన్నారు. ఈ అంశంపై రాష్ట్ర సంఘం నాయకులతో కలిసి ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తామన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి


రామశింగవరం ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను సత్కరిస్తున్న మండల అధికారులు, నాయకులు

పెదవేగి : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని పెదవేగి ఎంపీడీఓ జి.రాజ్‌మనోజ్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ ఎన్ నాగరాజు అధ్యక్షతన ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణంలో డ్వాక్రా సంఘాల తరుపున ఎక్కువ రుణాలు మంజూరు చేయించేందుకు కృషి చేసిన స్వయం సహాయక సంఘ వీఓఏలు 8 మందిని, డ్వాక్రా సంఘాల మహిళలు 8 మందిని, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఏడుగురిని దుశ్శాలువాతో సత్కరించారు. మిగిలిన లబ్ధిదారులకు కూడా ప్రభుత్వం తరుపున అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించి, త్వరితగతిన ఇళ్లను నిర్మించేలా కృషి చేయాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ కేశన సతీష్, హౌసింగ్ ఏఈ నాగరాజు, ఈఓపీఆర్‌డీ శ్రీనివాస్,ఏపీఎం బి శరత్ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

పెదవేగి : మండలంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎంపీడీఓ జి.రాజ్‌మనోజ్ అన్నారు. మండలస్థాయిలో వివిధ గ్రామాల్లో పనిచేసే ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాలని చెప్పారు. పెదవేగి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం మండల పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలతో, ఏఎన్ఎంలతో ప్రజారోగ్య పరిరక్షణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో విధులు నిర్వహించే ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు ప్రతి రోజూ తప్పనిసరిగా గ్రామాల్లో ఫీవర్ సర్వే చేయాలని సూచించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. వేసవితో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెదవేగి పీహెచ్‌సీ డాక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

పాడి పశువులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి


రామన్నగూడెంలో ఆవుకు గాలికుంటు నివారణ టీకా వేస్తున్న పశు వైద్యాధికారులు

ద్వారకాతిరుమల: పాడి పశువుల పోషణ పట్ల రైతులు ప్రత్యేక శ్రద్ధ కనబరిస్తే, ఆశించిన మేర ఆదాయం లభిస్తుందని ఏలూరు జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి.నెహ్రూబాబు అన్నారు. ద్వారకాతిరుమల మండలం రామన్నగూడెం గ్రామంలో మంగళవారం పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం చేపట్టారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ అంగర సురేష్, మరికొందరు వైద్యులు 810 పశువులకు ఈ టీకాలు వేశారు. అనంతరం పశు విజ్ఞాన బడి కార్యక్రమంలో పశు పోషణలో మెళకువలు, పశువులు తిరిగి పొర్లకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నెహ్రూబాబు రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ టి.గోవిందరాజు, అసిస్టెంట్ డైరెక్టర్ ఇక్కుర్తి సాయిరమేష్, పశు వైద్యాధికారులు గోపాలమిత్రలు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	26
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	32
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	32
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	29
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	18
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	28
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	25
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.15	34820	33
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	09.00	4794	30
ఏలూరు –తిరుపతి	16.00	4830	22
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	34

బ్రెయిన్ ట్యూమర్ బాధితుడికి సీఎం సహాయ నిధి అందజేత


క్రాంతి ప్రసాద్‌కు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: గ్రామానికి చెందిన బర్నాన క్రాంతి ప్రసాద్ బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆర్థిక సమస్యల కారణంగా చికిత్స చేయించుకునేందుకు స్థోమత లేక ఇబ్బందిపడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఇటీవల స్వయంగా క్రాంతిప్రసాద్ ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి చూసి చలించిపోయారు. ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దెందులూరు విచ్చేసిన సందర్భంగా క్రాంతి ప్రసాద్‌ను చూపించి అతని సమస్యను వివరించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు చెప్పిన గంటలోపే వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 1లక్ష చెక్కును కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌తో కలిసి ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి బాధితుడికి అందజేశారు. బ్రెయిన్ ట్యూమర్ మెరుగైన చికిత్స కోసం ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి సొంత ఖర్చుతో అంబులెన్స్‌ను ఏర్పాటు చేయించి క్రాంతిప్రసాద్‌ను హైదరాబాద్‌లోని సిటీ న్యూరో ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని డాక్టర్లతో మాట్లాడారు. ఆపరేషన్ కోసం ఎమ్మెల్యే సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ. 80 వేల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. క్రాంతి ప్రసాద్ వైద్యచికిత్స కోసం రూ.1.80 లక్షలు మంజూరు చేయించడంతో పాటు, అంబులెన్స్ ఏర్పాటు చేసి ఆదుకున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బాధితుడి కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు.